# పోస్టుమాస్టరు పాట్లు

బొప్పన శ్రీ లక్ష్మి అన్నపూర్ణాదేవి

★

మా వూరు కుగ్రామము. పూర్వము ఒక పోస్టు బాక్సు ఉండేదట. కాని మా వూరు నాగరికతను వరించక మునుపు తపాలు లేనందున ఖాళీపొట్టతో ఎదురుచూసే పోస్టుబాక్సును చూసి జాలితో మా వూరి పిల్లకాయలు చుట్టలు బీడీలు వేసేవారట. అందుచేత తిరిగి వారానికి పోస్టుబంట్రోతు వచ్చేటప్పడికి చుట్టలు బీడీలతో నింపుకున్న నిండుపొట్టతో పోస్టుబాక్సు గర్వించేదట. అప్పుడు పోస్టుబంట్రోతుకు కోపము వచ్చి అధికారులతో పితూరీచేసి బాక్సును వెంటనే తీయించి వేశాడని పూర్వకథ.

కాని అప్పటికి ఇప్పటికి చాలభేదముంది. ఈ నాగరిక ప్రపంచములో మేము ఎంతో ముందుకు పోయాము. ఆధునిక సంఘాలకు ఆలవాలము మా వూరు. కమ్యూనిస్టులనీ, కాంగ్రెసనీ, స్త్రీల సంఘాలని (ఇందులో కాంగ్రెస్ 'మహిళాసంఘము' కమ్యూనిస్టుల 'మహిళాసమితి' సంఘ సంస్కర్తల బాలభటసంఘము, (ఈ మధ్య బీడీభటసంఘముకూడా వచ్చిందట) కిసాన్ సంఘము, (కొంచెము వృద్ధులు కోన్ కిస్కా సంఘమంటారు కూడా) యువక సంఘము అనీ అనేకములు ఉన్నాయి. అత్తల సంఘము, కోడళ్ళ సంఘము, అల్లుళ్ళసంఘము... అని ఏమేమో స్థాపించబోతున్నారటకూడా. అసలు చెప్పేదేమిటంటే మా వూరి నాగరికత దినదినాభివృద్ధి చెందుతున్నదని, అందువలన ఉత్తర ప్రత్యుత్తరాలు సరిగా జరుగుటచేత ఒక పోస్టు ఆఫీసు తెరచి ఆరుమాసాలైనది.

ఇంతటి ఈ ఉత్తరప్రత్యుత్తరాలు మా వూరి పోస్టుమాష్టరుగారి చేతినుండియే జరుగవలసినది. గవర్నమెంటువారు డబ్బులేదని జవాన్ని ఇవ్వకపోవుటచేత మా మాష్టరుగారే ఈ ఉత్తరాలు పంచిపెడుతుంటారు.

అసలు విషయమేమిటంటే మా వూరి వివిధ శిబిరములనుండి మాష్టరుగారికి అనేక పేచీలు తెస్తుంటారు. పంచమాంగదళాలు (కాంగ్రెసువి), సప్తమాంగదళాలు (కమ్యూనిస్టులవి), లలితాంగదళాలు (మహిళలవి) పనిచేసి పోస్టుమాష్టరుగారిపై పితూరీలు లేవదీస్తున్నారు.

మొన్న నీమధ్యనే ఒకాయనకు నాట్ ఫెయిడ్ కార్డువస్తే మాష్టరుగారు పదిలముగా తీసికొనివెళ్ళి, డబ్బులివ్వమని అడిగితే, ఆయన ఆ కార్డులోని విషయాలు చదువుకొని "ఎబ్బె! ఇది నాకెందుకు? మీ కార్డు మీరే తీసుకొనిపొండని" డబ్బులివ్వకుండా ముప్పుతిప్పలు పెట్టేడట.

ఒక నవీనయువకుడికి తన ఆత్మబంధువు చనిపోయినట్లు ఉత్తరము వస్తే "చావుకబురు చల్లగా జెప్పుతున్నారని" అనుకొని నాలుగుదినములు ఆలస్యముచేసి ఉత్తరము ఇచ్చినారు మాష్టరుగారు. అంత అది చదువుకొని ఆగ్రహముతో ఆ యువకుడు "ఈ బంధువు మరణమువలన నాకు బోలెడు ఆస్తి వస్తుంది. ఎంత సంతోషకరమైన విషయము దాచినావు. చూడు నీ మీద రిపోర్టు చేస్తాను" అంటే మాష్టరుగారి మనసు ఎలా ఉంటుందో తెలిసికోండి.

ఒకవిద్యార్థి తన వూరిలో చిల్లర కరువుగా వుందని మద్రాసునుండి తన తండ్రికి చిల్లర మనియార్డరు చేసినాడు. మామూలుగా మాష్టరుగారు తనవద్దనున్న నోట్లు ఇవ్వబోగా విద్యార్థి తండ్రి ఆవేశము వచ్చి "చాలు! చాలు!! ఈ వెధవపనులు. మా అబ్బాయి చిల్లర పంపిస్తే నీవు నోట్లు ఇస్తావా, చూసుకో—" అన్నాడట. మాష్టరుగారి ఉపన్యాసము పనిచేయనందున 20 రూపాయిల చిల్లర వడ్డికి తెచ్చి ఎలాగో ఇచ్చుకున్నాడట.

ఒక బుద్ధిమంతుడు ఉద్యోగము జేస్తూ అప్పుడప్పుడు తండ్రికి మనియార్డరు చేస్తూండేవాడు. కొన్నాళ్ళకు తండ్రి చనిపోయినాడు. కర్మచేసి వెళ్ళిన తరువాత అలవాటు చొప్పున తండ్రిపేరనే మరల డబ్బు పంపించినాడు ఆ బుద్ధిమంతుడు. ఈ విషయము మన మాష్టరుగారికి తెలియును గనుక "ప్రమాదో ధీమతామపి" అన్నారు పెద్దలు. పొరపాట్లు సహజము" అని ఆయన తల్లిగారికి డబ్బు ఇచ్చి సంతకము తీసికొంటే, ఎవరిపేరనో వచ్చిన డబ్బు ఇంకొకరికెందుకు ఇచ్చినావని పై అధికారులు ఘట్టిగా ఘూటించినారట. పాపము! పుణ్యానికి పోతే పాప మెదురైంది.

* ఆనందవాణి

ఒకానొక వనిత భర్తకు లేఖ వ్రాస్తూ అడ్రసు వ్రాయడంలో అసలు పేరు వ్రాయక (పేరు చెప్పక మామూలుగా భర్తను సంబోధించవలసి వచ్చినప్పుడు వెల్లయ్య అని సాధారణముగా అంటుంటారు) అలవాటు చొప్పున వెల్లయ్యగారికి అని వ్రాస్తే అది డి. యల్. ఓ. కి వెళ్ళి తిరిగి వచ్చిందట. అందుపైన, తను 0-1-6 పెట్టి కవరులో వ్రాస్తే ప్రతి ముండాకొడుకు దాన్ని విప్పి ఎందుకు చూడాలని ఆమె, ఆమెను వెనకేసుకుని ఆమెభర్త పోస్టుమాష్టరును దులిపి పరువు నష్టపుదావా వేస్తామని బయలుదేరారట.

మా వూరిలోని ఒక అమ్మాయిని పెండ్లిచేసి కుంటామని పెండ్లికొడుకు వచ్చిచూసి, "నే వెళ్లి లగ్నానిగురించి ఉత్తరము వ్రాస్తాను" అనిచెప్పి వెళ్ళి ఏమనుకున్నాడో ఎన్నాళ్ళైకీ ఉత్తరము వ్రాయలేదు. అంత ఆ అమ్మాయితండ్రి మాష్టరు గారిచుట్టూ పదిరోజులు తిరిగి "ఎన్నాళ్ళైందినా ఆ ఉత్తరం ఇవ్వవు" అని ఆ మాష్టరుగారిని దబాయిస్తే ఆయన "వ్రాయలేదేమో. రాలేదు" అన్నాడు. "ఆ! ఎందుకు వ్రాయడు ? మా అమ్మాయి నల్లదైతేనేం, దైవవశాత్తు మశూచికంతో మచ్చలుంటేనేం. బంగారపు పిల్ల. నచ్చదా ? ఆ కారుకూత మరొకసారి కూయి" అని పోస్టుమాష్టరుగారిని కొట్టబోతే ఎవరో అడ్డు వచ్చారట.

ఇలా ఉంటవి మాష్టరుగారి పాట్లు. అయినా ఆయనంటే మాకందరికీ ఎంతో గౌరవం. మేమంటే ఆయనకూ అంతే.

ఇంతకీ మాష్టరుగారి పేరు చెప్పలా. ఎందుకంటే ఆయనపేరు అంతా మరచిపోయి, పోస్టుమాష్టరే అంటుంటారు. నిజానికి ఆయనపేరు చెప్పమంటే ఆయనకే తడబడుమాటే. ఎందుకూ, ఒకసారి ఆయనపేర ఉత్తరమువస్తే అలవాటు చొప్పున ఇది ఎవరికి వచ్చినదా అని (అంటే ఆయనపేరుతో మరి ఎవరూ లేరులెండి) రెండు రోజులూ ఆలోచించి భార్యతో చెప్పగా "అయ్యో! అది మీ పేరేగదా" అందట. అప్పుడు జ్ఞాపకంవచ్చింది అయనపేరు ఆయనకు. లేకపోతే పోస్టుమాష్టరే.

## సముచిత దృక్పథం

